ఆదివారం

ప్రజాశక్తి

అక్టోబర్ 6, 2002

హ్యాపీ బర్త్‌డే

(6-10-2002 నుండి 12-10-2002 వరకు)

డి. వసంత కుమారి అక్టోబర్ 6

దిడ్డి వాణిశ్రీ, దిడ్డి సురేంద్ర, మాసాయి పేట, మెదక్

ఎన్. మేఘున

7 సం॥, 6-10-1996

కె. కాంచన, ఎన్. సోమయ్య బోయగూడ, సికింద్రాబాద్.

మీాదం శెట్టి ప్రశాంత్ కుమార్

6 సం॥, 11-10-1996

జయశ్రీ, మీాదంశెట్టి వెంకటేశ్వరరావు, హరినగర్, హైదరాబాద్.

గౌడ వినీత

9 సం॥, 6-10-1993

కవిత, నరేంద్రదేవ్, గోవిందరాజులగుట్ట, వరంగల్.

ఎం. మహేష్

1 సం॥, 7-10-2001

సరోజా బాయి, ఎం.బాల్ రామ్‌నాయక్, దేవరకొండ, నల్లగొండ.

కందుల దీపిక

8 సం॥, 7-10-1994

సత్యవతి, కందుల నారెడ్డి, కోదాడ, నల్లగొండ.

చిమ్మి కుమార్ శ్రీనాథ్

1 సం॥, 9-10-2001

రేణుక, సిద్దులు, ఆలేరు, నల్లగొండ.

పి.వి. ఉషశ్రీరెడ్డి

1 సం॥, 6-10-2001

నాగేశ్వరి దేవి, లక్ష్మీనారాయణ రెడ్డి, నంద్యాల, కర్నూలు

పి. శివసాయి

2 సం॥, 12-10-2000

పి. నాగరాజు, పాణ్యం, కర్నూలు.

జి. సువర్చలా దేవి

9 సం॥, 12-10-1993

ఎన్.ఎ. లక్ష్మి, రామకృష్ణ, దర్శి, ప్రకాశం.

శ్రీ హనుమంతు నవీన్‌కుమార్

6 సం॥, 12-10-1996

శ్రీ హనుమంతు అమరావతి, ఉమాపతి, టెక్కలి, శ్రీకాకుళం.

మొగలిపువ్వు ఐశ్వర్య

1 సం॥, 12-10-2001

మొగలిపువ్వు సరళ, అనంతకుమార్, ఉండవల్లి, గుంటూరు.

విచక్షణా రహిత మందుల వాడకంతో కిడ్నీలకు ముప్పు



ఆరోగ్యవంతంగా వుండాలి అంటే దేహంలోని అవయవాలు అన్నీ సరిగా పని చేయాలి. వ్యాధుల వలన ఆరోగ్యం పాడవుతుంది. దీనిని గురించి సరైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధి కంట్రోల్ చేయడం కాని, పూర్తిగా తగ్గించడం గాని చేయవచ్చు. ఒక్కొక్కసారి ఆ వ్యాధి మందులకు, వైద్యానికి అందనిది అయితే ప్రాణాపాయం కూడా కలగవచ్చు. వ్యాధులు రావడం అనేది చాలా వరకు మన చేతిలో లేదు. కాని మందుల విషయం అలాకాదు. మనం తీసుకొనే ప్రతి మందు గురించి జాగ్రత్త వహిస్తే మందుల వలన వచ్చే ఇబ్బందులను దాదాపుగా అరికట్టవచ్చు.

మందులు నోటి ద్వారా గాని, ఇంజక్షన్ రూపేణా గాని ఇవ్వడం జరుగుతుంది. ఈ మందులు వాటికి నిర్దేశించిన పని అయిన తర్వాత అవి రూపాంతరం చెంది (Metabolites) మలినాలుగా మారి లివర్ ద్వారా గాని, మూత్ర పిండాల ద్వారా గాని విసర్జించబడతాయి. కొన్ని మందులు ఈ దశలోనే Accumulate అవుతాయి. ఈ మందులు మోతాదుకు మించి ఇచ్చినపుడుగాని, ఎక్కువకాలం వాడినపుడు గాని, ఇతరత్రా మూత్ర పిండాలకి ఇబ్బంది వున్నప్పుడు మూత్ర పిండాలను పాడు చేస్తాయి.

ప్రధానంగా ఎక్కువ శాతం మందిలో మూత్ర పిండాలకు ఇబ్బంది నొప్పులకు వాడే మందుల వలన కలుగుతుంది. ఎందుకంటే ఈ నొప్పి మాత్రలు మనకు ఎక్కడైనా దొరుకుతాయి. మందుల షాపులో గాని, ఏ ప్రిస్క్రిప్షన్ అవసరం లేకుండా కూడా లభిస్తాయి. ఈ మందులు ఇచ్చేవారికి, తీసుకొనే వారికి కూడా మందుల వలన వచ్చే అనర్థాలపై అవగాహన వుండదు.

ముఖ్యంగా ఈ మందులు తీసుకొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలా వరకు ఇబ్బంది అరికట్టవచ్చు. ఈ మందులు (NSAIDS) వయస్సు పై బడిన వారికి (50 సంవత్సరాలు), సుగర్ వ్యాధి, రక్తపోటు, గుండె జబ్బు, మూత్రపిండ వ్యాధులు, లివర్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు వున్నవారికి, చిన్న పిల్లలు 5-6 సంవత్సరాలలోపు వారు, జ్వరం ఎక్కువగా వున్నప్పుడు, ఇతర మందులు వాడేటప్పుడు సాధ్యమైనంత వరకు ఈ మందులు వాడరాదు లేదా మోతాదు తగ్గించి ఇవ్వాలి. ఈ మందులు PGI మీద పనిచేసి అవి విదుదల కాకుండా చేస్తాయి. ఈ PGI తగ్గడం వలన మూత్రపిండాలకు రక్తప్రసారం తగ్గి కిడ్నీ ఫెయిల్యూర్ రావడం జరుగుతుంది. లేదా INTERSTICIAL NEPHRITIS అని కిడ్నీలో ఎలర్జీ వచ్చి మూత్రపిండాలు పాడవుతాయి. ఈ కోవలోకి వచ్చే మందులు నిముసులైడ్, డైక్లోఫినాక సోడియం, బ్రూఫిన్, ఎనాలజిన్ మొదలగునవి..

ఇవేకాకుండా చాలా రకాల నాటు మందులు వాడే వాళ్ళని మనం చూస్తూ వుంటాం. ఈ నాటు మందులు కొన్నింటిలో మెటల్స్ వాడతారు. ఉదాహరణకు పాదరసం, బంగారం. ఈ లోహాలు మన దేహంలోనికి ప్రవేశించిన తర్వాత ఇవి బయటకు పోకుండా శరీరంలో ఉండిపోయి అక్కడ్నుంచి ప్రమాదం కలిగించి మూత్రపిండాలను శాశ్వతంగా పాడుచేస్తాయి. అలాగే DIABETIC MELLITUS (సుగర్ వ్యాధి) రోగులు అల్లోపతి మందులు జీవితాంతం వాడాలి. నాటుమందుల వలన పూర్తిగా తగ్గిపోతుంది అని అవి వాడి సాధారణంగా సుగర్ వ్యాధివచ్చిన తరువాత 25 నుండి 30 సంవత్సరాలకు పాడయ్యే మూత్రపిండాలను 3-4 సంవత్సరాలలోనే పాడు చేసుకుని వచ్చేవారిని చాలామందిని చూస్తున్నాము.

ఇక్కడ అందరూ గమనించవలసినది ఏమిటంటే ఒకసారి సుగర్ వ్యాధి వచ్చిన తర్వాత అది ఎప్పటికీ వుంటుంది. దీనిని కంట్రోల్‌లో పెట్టుకోవచ్చు గాని, పూర్తిగా నయం చేయడం వీలుపడదు. దీని నియంత్రణ అనేది ఆహార మార్పుల ద్వారా గాని, ఇన్సులిన్ వలన గాని చేసుకోవడం వలన దేహంలోని అవయవాలను అంటే కన్ను, మూత్రపిండాలు పాడవకుండా చూసుకోవచ్చు. అంతేగాని ఈ నాటుమందులు వాడటం వలన సుగర్ వ్యాధి తగ్గుతుంది కాని మూత్రపిండాలు శాశ్వతంగా పాడవుతాయి.

ఉబ్బు కామెర్లు అని చాలాసార్లు వింటాం. సాధారణంగా చిన్నపిల్లల్లో చూస్తాం. ఈ వ్యాధి వచ్చినపుడు మూత్ర విసర్జన తగ్గుతుంది. ఒళ్ళంతా వాపులు వస్తాయి. ఒక్కొక్కసారి మూత్రం రక్తం రంగులో వస్తుంది. ఈ వ్యాధిని NEPHROTIC SYNDROME అని గాని, ACUTE GLOMERULO NEPHRITIS అని అంటారు. ఈ వ్యాధి వచ్చినపుడు సరైన వైద్యం జరగకపోతే మూత్రపిండాలు పూర్తిగా పాడయ్యే అవకాశం వుంది. ఈ వ్యాధికి చాలామంది నాటుమందులు వాడతారు. దానివలన కూడా చిన్న వయసులో మూత్రపిండాలు పూర్తిగా పాడయ్యే వారిని చూస్తుంటాం. ఎవరైనా సరే మందులు ఇచ్చే ముందుగాని, తీసుకునే ముందుగాని వాటి గురించి సరైన అవగాహన వుండి, అవసరం లేకుండా మందులు వాడటం మానితే, నొప్పులకు మందులు ఎక్కువగా వాడకుండా వుంటే మందుల వలన వచ్చే మూత్ర పిండ వ్యాధులు అరికట్టవచ్చు. నొప్పులకు తప్పనిసరిగా వాడాల్సి వస్తే TRAMADOL గాని PARACETAMOL గాని మందులు వాడినచో మూత్రపిండాలకు ఇబ్బంది కలగదు.

(నాగార్జున విజ్ఞాన పత్రిక నుండి)

నెగిటివ్

పులి కళ్యాణి

అపుడు సాయంత్రం ఆరవుతుంది. సందులో నుండి మార్తాండం వడివడిగా మెయిన్ రోడ్డు మీదకు వచ్చి నిండుగా శ్వాస పీల్చుకున్నాడు. మనసంతా చాలా వుల్లాసంగా వుంది. రెండు చేతులూ పాంటు జేబుల్లోకి జోనిపి ముందుకు నడిచాడు.

బలరాంని కలవాలి - వాడ్ని కలవక వారం దాటింది. ఎట్లా వున్నాడో... ఈ వారంలో ఏదైనా బ్రేక్ దొరికిందో... ఛ... ఛ.. వాడో జిడ్డు మొహం... అన్నీ జిడ్డుమాటలు... వేగం మచ్చుకైనా కనిపించదు... గంగిగోవు గోత్రానికైనా చెందుండాలి.... కానీ కాలం కూడా సజావుగా సాగాలిగా!

రోడ్డు మీద కార్లు... ఆటోలు... ఆడవాళ్ళు... రంగులైట్లు... దుకాణాల నిండా జనమే జనం... మెయిన్ రోడ్డు ఎడం వైపు మలుపు తిరిగాడు. 'అజంతా' - అనే తమ అడ్డా... బలరాంగాడు నాలిక చప్పరించుకుంటో ఆ రెస్టారెంటు ముందే తచ్చాడుతాడు - పూర్‌ఫెలో... వాడంటే తనకభిమానం... చాలా మంచివాడే! అందుకే తనకు ఒళ్ళంతా మండిపోతుంది. అంత మంచితనం పనికిరాదు. దేనికైనా తెగింపు కూడా అవసరం గదా!

'అజంతా' పెద్ద ఫైవ్‌స్టార్.. త్రీస్టార్ కాకున్నా దాన్లో అన్నీ దొరుకుతాయి. లోపల కూర్చోడానికి ప్రత్యేకంగా చిన్న గదులు ఓ మూడు ఏర్పాటు చేశారు. అందులో తీరుబాటుగా మద్యం పుచ్చుకోవచ్చు.. పేకాట లాంటివి ఇంకా అమర్చలేదుగానీ... అడపాదడపా ఆడపిల్లల్ని అందించి ఆదుకుంటాడు ప్రొప్రయిటరు. మార్తాండం అక్కడికి చేరుకోడంతోనే లోపల చెక్క కుర్చీ మీద గోళ్ళు కొరుక్కుంటూ కూర్చున్న బలరాం మొహం చాటంతయింది. అల్ప సంతోషి!

"ఏంరా మార్తాండం... వారం రోజులాయె! పత్తా లేకపోతివి!" వాడి పలకరింపుతో సంబంధం లేకుండా మార్తాండం ఠీవిగా రెస్టారెంటులోకి నడుస్తుంటే, పిల్ల కూనలా బలరాం గునగున వెంటబడి వస్తున్నాడు.

"ఒక ఫుల్‌బాటిల్ రాయల్ ఛాలెంజి.. నాకౌట్ నాలుగు... చిల్లీ చికెన్.. మసాలా గారెలు.... కింగ్ సైజు పాకెట్లు రెండు...

బలరాం నోరు బార్లా వెళ్ళబెట్టాడు. మార్తాండం అదేం పట్టించుకోకుండా లోపల వెనకగదిలో కుర్చీలో కూర్చుని విలాసంగా కాళ్ళు టేబిల్ మీదికి చాచాడు. బలరాం కళ్ళు నులుముకుని బితుకుబితుకుమని ఒక కుర్చీలో కూలబడ్డాడు.

"ఏంరా మార్తాండం.. లెవలు మారిపోయిందేంట్రా... ఒక్కసారే స్టార్ స్థాయికి ఎగబడినవ్! వార్నీ... ఎక్కడ తగిలిందిరా అంత 'బ్రేకు' -

బలరాం మాటలకు మారుపలక్కుండా మార్తాండం గ్లాసులో విస్కీ పోసి సోడాలు కలపడంలో మునిగిపోయాడు. బలరాం ఒక గ్లాసందుకుని ఆత్రంగా రెండు గుటకలేసి సేదతీరాడు. మార్తాండం సిగరెట్ వెలిగించి విలాసంగా పొగ గాల్లోకి వదిలాడు. పక్కజేబులో నుండి దాదాపు పదికట్టలు కరెన్సీ తీసి టేబిలు మీద పెట్టాడు. అవి ఓ లక్ష దాకా వుండొచ్చు. బలరాంకు మూర్ఛవచ్చినంత పనయ్యింది.

"మార్తాండం... ఇవి... ఇవి నిజం నోట్ల కట్టలే..!" బలరాం నమ్మలేనట్లు అడిగాడు... మార్తాండం నవ్వి ఓ పదివేల రూపాయల కట్ట బలరాం మీదికి విసిరేశాడు.

"పోరా... నీ ఇష్టం వచ్చినచోట మార్చుకో! బ్యాంకుల్లోనైనా సరే!" "సరేగానీ... ఎక్కడ వేశావ్ దెబ్బ... ఈ మధ్యకాలంలో దుకాణాల తాళాలు పగలగొట్టడం... రాత్రి కన్నాల దెబ్బదీయడం డేంజర్ అనుకుంటిమి గద!"

మార్తాండం విలాసంగా నవ్వాడు.

"బలరాం... డబ్బు దొంగిలించడం ఒక ఆర్టు.... దోపిడీ ఒక పెద్ద ఆర్టు" అయితే పట్టుబడకుండా... ఎట్లాంటి ఆధారాలు దొరక్కుండా 'లూటీ' కానిచ్చేయడం అన్నిటికన్నా అతి పెద్ద ఆర్టు! చూడ్రా... ఓ దొంగతనమో... కన్నమో... తాళం పగలేయటమో చేస్తే అక్కడ ఏదో ఒక మన వస్తువును మనం మరిచిపోడం... ఎవడైనా అనుకోకుండా మనల్ని చూడ్డం... దొరికిపోడం... ప్చ్... లాభం లేదు..."

బలరాం ఆరాధనా పూర్వకంగా వింటూ విస్కీ చప్పరిస్తున్నాడు.

ఈ వారం రోజులు అట్లాంటి జాగ్రత్తలు తీసుకోవడం కోసం ఎన్నో మార్గాలు ఆలోచించాను. అన్ని రిస్కులనూ అతి జాగ్రత్తగా వెరిఫై చేసి ఫూల్‌ప్రూఫ్' ప్లాను... అదీ... అట్లా అమలుచేశాను గదా... లక్షా అయిదువేలు గిట్టుబాటు...

"ఎట్లా?" బలరాం మరింత ఆసక్తిగా అడిగాడు.

"క్రాస్‌రోడ్సు దగ్గర ఓ పెద్ద వీడియో - ఫొటో - విజువల్ మెటీరియల్ స్టూడియో... షాపు... అంతా పెద్ద బిజినెస్... ఉదయం పదకొండు గంటలకు ఫొటోగ్రాఫర్ - మరో కుర్రాడే వుంటారు - అది బెస్ట్ టైమ్ - సర్వే చేశాను - రష్ కూడా మొదలు కాదు -

బలరాం వూపిరి బిగబట్టి ఆసక్తిగా వింటున్నాడు -

"అదీ... పాస్‌పోర్ట్.. వీసాకోసం అర్జంటుగా ఫొటో దిగాలని పోయి మూడు రెట్లు అధికంగా డబ్బిస్తాను... అర్జంట్...అని మూడు యాంగిల్స్‌లో మూడు ఫొటోలు దిగాను - వాడు డార్క్‌రూంలో ఫొటో ప్రింట్లు వేయడానికి పోయాడు - వందరూపాయల నోటిచ్చి మైలు దూరంలో మాత్రమే దొరికే 555 సిగరెట్ పాకెట్ కోసం కుర్రాడ్ని పురమాయించాను.. ఎవరూ వుండరు గదా...

బలరాం గ్లాసు టేబిల్ మీద పెట్టి సిగరెట్ వెలిగించాడు-

"డార్క్‌రూంలో వాడ్ని కత్తితో బెదిరించి కాళ్ళు చేతులు కట్టిపారేశాను - తాళం చేతులు.. బీరువా... క్యాష్‌బాక్స్... మొత్తం కరెన్సీ చిన్న బ్యాగులో నింపుకున్నాను-సిగరెట్ వెలిగించి తాపీగా బయట జనసముద్రంలో కలిసిపోయాను. ఫినిష్... రోజూ వచ్చే ఎంతోమంది కస్టమర్లలో వాడు నన్ను గుర్తుపట్టలేడు... బిజీ....

"మరి నీ ప్రింటేసిన ఫొటోలు... మూడుఫోజులు...!" బలరాం నోరుతెరిచి ఆదుర్దాగా అడిగాడు.. మార్తాండం జేబులోనుండి కవరు - దాన్లో నుండి మూడు ఫొటోలు తీసి తాపీగా లైటరు వెలిగించి వాటినంటించి దరహాసం చేశాడు.

"మొత్తం కచ్చితంగా పదిహేను నిమిషాల్లో పని పూర్తి చేశా.. ఎంతుంది?" మార్తాండం హుషారుగా ఈలవేసి మరో రెండు విస్కీ నింపుకున్నాడు.

మరుక్షణంలో బలరాం మెదడులో ఫ్లాష్‌బల్బు వెలిగినట్లయింది - "ఓరి దరిద్రుడా.. నీ ఫొటోలు సరే.. మరివాటి తాలూకు నెగిటివ్... అది... అది అక్కడే ఉండిపోతుంది గదరా...!" బలరాం కీసర బాసరగా అరిచేలోగానే... రెస్టారెంటు బయట పోలీసుల విజిల్స్... బూట్ల చప్పుడు వినిపించాయి!

ఆర్ట్ గ్యాలరీ



డాట్‌కామ్.

చందమామ పుస్తకాన్ని ఇంటర్నెట్‌లో కూడా చదవవచ్చు. పుస్తకంలో
ని కొన్ని గేమ్స్ ఇంటర్నెట్‌లో ప్రత్యేకంగా ఉంచుతారు. ఇవన్నీ చూడాలంటే కింది
ట్ ఓపెన్ చేయడమే మరి.

www.chandamama.org

మనదేశం-కొన్ని వివరాలు

హలో ఫ్రెండ్స్,

నా హాబీ ఏమిటో తెలుసా! రకరకాల దేశాల వివరాలు
సేకరించడం. అందులో భాగంగా మనదేశం గురించి నేను
సేకరించిన కొన్ని వివరాలను మీకు అందిస్తాను.

మన జాతీయ జెండా : మూడు రంగుల జెండా
మన జాతీయ చిహ్నం : మూడు సింహాలు
మన జాతీయ గీతం : జనగణమణ
మన జాతీయ గేయం : వందేమాతరం
మన జాతీయ జంతువు : పెద్దపులి
మన జాతీయ పక్షి : నెమలి
మన జాతీయ పుష్పం : తామరపువ్వు
మన జాతీయ ఫలం : మామిడి
మన జాతీయ క్రీడ : హాకీ
మన జాతిపిత : మహాత్మాగాంధీ

మన జాతీయ జెండాలోని మూడు రంగులు ఏ భావానికి
...దిహ్నాలో చూద్దామా!

కాషాయరంగు : త్యాగం, సాహసం
తెలుపు రంగు : శాంతి, సత్యం
ఆకుపచ్చ : అభివృద్ధి, విశ్వాసం

-బి. శ్రీలక్ష్మి, 5వ తరగతి, ఎంపిపి స్కూల్,
భద్రాచలం, ఖమ్మం జిల్లా

క్విజ్-25

1. గోబర్ గ్యాస్‌లో ఉండే వాయువు?
ఎ. మిథేన్ బి. నైట్రోజన్

2. రక్తం గడ్డ కట్టడానికి తోడ్పడే విటమిన్ ఏది?
ఎ. విటమిన్ ఎ బి. విటమిన్ కె

3. తాతాజీ అనే పేరు కలిగిన రచయిత ఎవరు?
ఎ. తాపీ ధర్మారావు బి. నెహ్రూ

4. మార్చి 8వ తేదీన ఏ దినోత్సవం జరుగుతుంది ?
ఎ. సైనిక దినోత్సవం బి. మహిళా దినోత్సవం

5. 'అసమర్ధుని జీవయాత్ర' నవల రాసిందెవరు?
ఎ. బుచ్చిబాబు బి. గోపీచంద్

6. యక్షగానం ఏ రాష్ట్రానికి చెందిన నృత్యం?
ఎ. కేరళ బి. కర్ణాటక

7. అజంతా గుహలు ఏ రాష్ట్రంలో కలవు?
ఎ. త్రిపుర బి. మహారాష్ట్ర

8. తస్లీమా నస్రీన్ రచించిన వివాదాస్పద నవల ఏది?
ఎ. గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ బి. లజ్జ

9. మన రాష్ట్రంలో రామప్పగుడి ఏ జిల్లాలో ఉంది?
ఎ. వరంగల్ బి. కరీంనగర్

10. పక్క ఫొటోలోని వ్యక్తి ఎవరు?
ఎ. దల్వాసి బి. బళ్ళారి రాఘవ

చూశాను కానీ...

ఒకసారి నసీరుద్దీన్ పొలంలో పనిచేస్తుండగా ఒక వ్యక్తి గుర్రంపై వేగంగా వచ్చాడు. గుర్రం మీది నుండి దిగకుండానే.. 'హలో...ఇటు వైపు ఒక జింక పరిగెత్తుకు వచ్చింది. నువ్వు గాని చూశావా' అని అడిగాడు.

'ఆ..చూశాను' అన్నాడు నసీరుద్దీన్.

'చూశావా...అది ఎటువైపు వెళ్ళిందో చెప్పు' అన్నాడా వ్యక్తి మరింత తొందరతో.

నసీరుద్దీన్ పడమర వైపు చూపిస్తూ 'ఇటే వెళ్ళింది' అన్నాడు.

ఆ వ్యక్తి అంతే వేగంగా పడమర దిక్కు వైపు వెళ్ళాడు. కొద్దిసేపటికి ఆ వ్యక్తి తిరిగి నసీరుద్దీన్ దగ్గరికే వచ్చాడు.

'ఆ దిక్కున జింక ఏదీ కనపడలేదు. నీవు చెప్పింది నిజమేనా?' అన్నాడు కొంచెం కోపంగా.

'నే చెప్పింది కరక్టే. అయితే జింక రెండేళ్ళ క్రితం ఇటువైపు వెళ్ళినప్పుడు నేను చూశాను' అన్నాడు తాపీగా.

బ్రూనో టోపీ బాబుగారి లూటీ

రుక్మిణి

"లూటీ దేశం'లో ఒక టోపీలమ్మే వ్యాపారి తన వ్యాపారాన్ని పల్లెపల్లెకూ విస్తరింపజేసుకుని.. జనాలందరికీ – అవసరమున్నా.. లేకున్నా.. తన మాటల చాతుర్యంతో రకరకాల.. రంగురంగుల 'టోపీ'లను నమ్మబలికి వాళ్ళకు అంటగట్టి ఖరీదు వసూలు చేసుకుని లాభాలు గడించేవాడు. అబ్బో.. వాడి దగ్గిర రకరకాల టోపీలు.. వివిధ సైజులవీ.. రంగురంగులవీ..! బహు ఆకర్షణీయమైన మాటలు చెపుతూ తిరిగేవాడు.

ఒకరోజు వాడు టోపీల మూట భుజానవేసుకుని మిట్ట మధ్యాహ్నం వేళ తన 'దేశా'నికి తిరిగి వస్తున్నాడు. ఎండ దంచి దంచి కాస్తుంది. కాస్తంత విశ్రాంతి తీసుకుందామని ఒక చెట్టు దగ్గిర ఆగి.. మూట పక్కన బెట్టి తువాలు పరుచుకుని నిద్దట్లోకి జారుకున్నాడు. అయితే ఆ చెట్టు మీద మిక్కుటంగా వున్న 'కోతులమూక'ను అతడు గమనింపలేక పోయెను. కాస్త ఎండ తగ్గుముఖం పట్టగానే లేచి చూసుకుంటే ఏముంది? మూట ఖాళీ.. చూస్తే కోతులన్నీ తలా ఒక టోపీ అందుకుని బుర్రకాయలకు తగిలించుకుని చెట్టుకొమ్మల మీద చేరి గెంతులేస్తూ పళ్ళికిలిస్తున్నాయి.

వర్తకుడికి ముచ్చెమటలు పోశాయి. ముందస్తుగా చిందులు వేసి, జుట్టు పీక్కున్నాడు. కోతుల సంఖ్య చాలా పెద్దది! టోపీలు మొత్తానికి మొత్తం అందుకుని చిటారుకొమ్మ నెక్కి కూచున్నాయి.. ఎట్లా? ఎట్లా..?

ఏదో ఒక 'పథకం' ఆలోచించాలి! అపుడు తీరిగ్గా వాడు గమనించిందేమిటంటే తాను చిందులేస్తుంటే – కొమ్మల మీద కోతులు కూడా చిందులేస్తూ చేతులూపు తున్నాయి. తాను చేతులు చాచితే అవి కూడా చాస్తున్నాయి. ఒంగితే అవీ ఒంగుతున్నాయి. వర్తకుడి బుర్ర చకచకా కంప్యూటర్లా పనిచేసింది?

* * *

"బ్రహ్మాండమైన పథకం.. వినూత్నం! ప్రపంచంలో మరే దేశంలోనూ అమలుకాని, అమలు చేయలేని ఈ 'పథకం' ద్వారా మన స్వర్ణాంధ్ర ప్రజలందరూ ఎవడి కాళ్ళమీద వాడు నిలబడతాడు. దీనికి తిరుగులేదని మీకు తెలియజేసుకుంటున్నాను. స్వయం ఉపాధీ.. మహిళా శక్తీ.. కుటుంబాలకు భుక్తీ...!"

చంద్రబాబుగారి చిందులాట జూసి మంత్రివర్గ సభ్యులు.. ప్రజలూ నోళ్ళు వెళ్ళబెట్టారు.

"మళ్ళా మహిళలకోసం సరికొత్త 'పథకం' కాబోలు..!" ఎవరికి వాళ్ళు గొణుక్కున్నారు.

"ఇది టోపీల పథకం! కోట్లు గడించే పథకం..!"

అక్కడున్న వాళ్ళందరికీ అనుమానం వేసింది. పథకాల పేర్లు చెప్పి ప్రజలకు రకరకాల టోపీలేస్తున్నాం! వాళ్ళూ విసిగి పోతున్నారు. మరి ఇది 'పథకాల టోపీ' కాదంటున్నాడు. పైగా – 'టోపీ పథకం' అంటే కొత్త సంగతే! అందుకని అందరూ చెవులప్పగించి ఆసక్తిగా వింటానికి తయారై పోయినారు.



"ఇది టోపీ తీసే పథకం కాదు. టోపీలు తయారు చేసే పథకం! టోపీకి ఇంతరేటు. డజనుకు ఇంత! బ్రూనో దేశపు సుల్తానుగారు మక్కా మదీనా పుణ్యక్షేత్రాలకు పోయే 'పుణ్య ముస్లిం'లకు ఉచితంగా టోపీలందజేసే 'ఉదార పథకం' కింద కోట్లు.. కోట్లు కేటాయిస్తామంటున్నారు...!"

"హన్నా.. ప్రపంచ బ్యాంకూ.. కోట్లు.. కోట్లు.. అప్పు.. వడ్డీలు.. మళ్ళీ ఈ బ్రూనో సుల్తానెవడ్రా బాబూ!" మూలిగాడు ఒక మంత్రి.

"ఇది అప్పుకాదు. ఉదారం.. ఊరికే కోట్లు.. కోట్లు ఇస్తానని చేతిలో చెయ్యేసి చెప్పాడు.. అంతా రెడీ!"

"వార్నీ.. ప్రపంచంలో ఏ మూలన ఎవడికి మన బాబుగారు టోపీ పెడతాడో ఎవడికెరుక? అంతా మాయటోపీ! అబ్బో..!" విభ్రాంతికిలోనై బుగ్గలు నొక్కుకున్నారు మంత్రులు.

"మన డ్వాక్రా మహిళల్ని పురిగొల్పండి.. పునరుద్ధరించండి.. ముడి సరుకు కోట్లు.. కోట్లు.. టోపీకి ముప్పయి రూపాయలు.. కోట్లు.. కోట్లు... పాతిక వేల మందికి ఉపాధి.. ఇంటర్నెట్ ద్వారా డైరెక్టు ఇంటర్నేషనల్ బిజినెస్.. మన కలలు ఫలించాయి.. టోపీలు పెట్టడానికి దేశదేశాలు పోటీలు పడి దూసుకు వస్తున్నాయి. ముక్కికి టోపీలు... టోపీలు...

* * *

వర్తకుడి బుర్రలో బ్రహ్మాండమైన మెరుపు మెరిసినట్లయింది. తన చిన్నపుడు తనకు మాస్టారు చెప్పిన 'కోతులు – టోపీలు' కథ అప్పటిదాకా తనకు గుర్తుకు రానందుకు కుపితుడై తన్ను తాను కసితీరా బూతులు తిట్టుకుని ఆనక శాంతించాడు. శాంతించి, కాసేపు ఆ కోతులతో తాను సర్కసు విన్యాసాలు చేస్తూ వాటితో రకరకాల ఫీట్లు చేయించాడు. క్లైమాక్స్‌గా తన తలమీద టోపీ తీసి బలంగా నేలకేసి కొట్టి – నింగికేసి ఆశగా, ఆబగా కోతుల బుర్రకాయలూ..వాటి మీది టోపీల వంక చూసి, కండ్లు మూసుకుని, అవి కాస్తా లపలప తనలాగా విసిరేసే టోపీలను తలుచుకుంటూ.. మౌనంగా నిలబడ్డాడు.

చిత్రం! కళ్ళు తెరిచి చూసేసరికి తాను నేల మీదికి విసిరి కొట్టిన టోపీని ఒక చలాకీ కోతి చెంగున దూకి, గప్పున అందుకుని చెట్టెక్కి కూర్చుంది. ఉన్న ఒక్క టోపీ కూడా పాయె! వాడు లబోదిబో మన్నాడు!

* * *

"డ్వాక్రా మహిళలకు అద్భుత అవకాశం.. మీ కాళ్ళమీదనే మీరు నిలబడడానికీ... గతంలో మీరు కన్నీరు కార్చకుండా – వంట సులసుల్లగా అయ్యేట్టు.. మీ ఓట్లు గుండు గుత్తగా మాకే గుద్దేట్లు పోయిన ఎన్నికల ముందు 'గ్యాసు బండల మురిపెం' చూపించాం.. ఈసారి మాత్రం మీ 'టోపీలు' మీరే తయారు చేసుకుని కోట్లు కోట్లు సంపాదించే అత్యద్భుత పథకం...

మంత్రిగారు మహిళలకు టోపీలు.. వాటి శిక్షణా.. జపాన్ శిక్షకులు.. ముడిసరుకు విమానాల్లో.. ఇంటర్నెట్ గురించి భారీగా బోధన చేస్తున్నాడు.. వారి పి.ఏ. పరుగున వచ్చి చెవిలో గుసగుస ఊదాడు.

"బ్రూనో సుల్తానుగారు పంపిన 'టోపీ ముడిసరుకు' ముచ్చటపడి మీ అల్లుడుగారు టోకున మార్కెటుకు తరలించి బ్లాకులో అమ్ముకున్నాడు మరి...."

మంత్రిగారు నోరెళ్ళ బెట్టాడు..

"తాజావార్త.. టోపీల ముడిసరుకు ధర విదేశీ మార్కెట్లో విపరీతంగా పెరిగిపోయింది. కాబట్టి మీరు జాగ్రత్తగా దాచుకున్న మీ 'పొదుపు'ను మొత్తం టోపీ ముడిసరుకు ధర ఎంతైనా సరే.. దాన్ని బ్లాకులోనైనా సరే.. ఖరీదు చేసి టోపీలు కుట్టి, ఇంటర్నెటులో పెట్టి, విదేశీ మారక ద్రవ్యం.. డాలర్లు.. మీ కాళ్ళమీద మీరు....

బ్రూనో సుల్తాన్‌గారు బిత్తరపోవడం కాదు.. డ్వాక్రా మహిళలు తత్తర పడ్డారు.. ఎవరు ఎవరికి టోపీ పెడుతున్నారు? జనాలకా? సుల్తాను గారికా..? రేపు అందరూ కలిసి ఎవరికి టోపీ పెట్టి టొపారం లేపెయ్యాలి?

అదీ అసలు ప్రశ్న!

'టెన్నిస్ సంచలన తరంగం సానియా'

మారేపల్లి లక్ష్మణ్

భారత టెన్నిస్‌లో మహేష్ భూపతి లియాండర్ పేస్‌ల తర్వాత ఇప్పుడు తరచుగా వినిపిస్తోన్న పేరు సానియా మీర్జా. మహిళా టెన్నిస్‌లో ఒకప్పుడు నిరుపమా వైద్యనాథన్ పేరే ప్రముఖంగా వినవచ్చేది. ఇపుడు పరిస్థితి మారింది. సంవత్సర కాలంలో అంతర్జాతీయ జూనియర్ టెన్సిస్‌లో పలు విజయాలను సాధిస్తూ వస్తున్న సానియా మీర్జా ఇప్పుడు భారత మహిళా టెన్నిస్‌లో ప్రముఖంగా వెలుగొందుతున్నది. గత రెండేళ్లకాలంలో యు.ఎస్. ఓపెన్, వింబుల్డన్, ఆస్ట్రేలేసియా వంటి జూనియర్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలతో సహా పలు అంతర్జాతీయ పోటీలలో పాల్గొని 16కు పైగా సింగిల్స్, డబుల్స్ టైటిల్స్ సాధించిన సానియాకు అతి చిన్న వయస్సులో ఏసియాడ్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సానియా మీర్జా హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ (ఐ.టి.ఎఫ్) మహిళా టోర్నీలో విజేతగా నిలవడం ద్వారా సంచలనం సృష్టించింది. ఈ టైటిల్‌ను గెలవడం ద్వారా తన కెరీర్‌లో మరో మైలురాయిని అధిగమించింది. అన్‌సీడెడ్ క్రీడాకారిణిగా బరిలోకి దిగి సీడెడ్ ఆటగాళ్లను ఖంగుతినిపిస్తూ ఫైనల్‌కు చేరుకున్న సానియా ఫైనల్లోనూ అదే ధాటిని కొనసాగించింది. ఫైనల్లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అయిదో సీడ్ అమాన్ ముదోవను వరుస సెట్లలో కేవలం 45 నిమిషాల్లోనే ఓడించింది. అంతకు ముందు క్వార్టర్‌ఫైనల్లో టాప్‌సీడ్ రుష్మీ చక్రవర్తిపై, సెమీఫైనల్లో మలేసియాకు చెందిన చిద్ బీ ఖూపై సంచలన విజయాలతో ఫైనల్‌కు చేరుకుంది. అంతర్జాతీయ సర్క్యూట్‌లో వరుస విజయాలను సాధిస్తూ సానియా సంచలన తారగా వెలుగొందుతున్నది.

అదే తీరును హైదరాబాద్‌లోనూ కొనసాగించింది. వింబుల్డన్ జూనియర్ విభాగం డబుల్స్ టైటిల్‌ను గెలుపొందిన సానియా మీర్జాకు ఈ టోర్నీ గెలుపు మరో ఘన విజయం లాంటిది. ఈ విజయం బుసాన్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో పతకంపై ఆశలను రెట్టింపు చేసింది. ఇప్పటి వరకు జూనియర్ సర్క్యూట్స్‌లోనే ఆడిన సానియాకు ఇదే తొలి సీనియర్ సర్క్యూట్ విజయం.

సానియా మీర్జా ఎలాంటి క్రీడా నేపథ్యంలేని కుటుంబం నుండి వచ్చినా తండ్రి అజీజ్ మీర్జా, తల్లి నసీమ్‌ల ప్రోత్సాహంతో టెన్నిస్‌లో అంచలంచెలుగా ఎదిగింది. చిన్నప్పుడు స్విమ్మింగ్‌పై మక్కువతో నిజాం క్లబ్‌కు వెళ్లిన సానియా అక్కడ టెన్నిస్ ఆడుతున్న వారిని చూసి ఆ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. తండ్రి అజీమ్ తోడ్పాటు కూడా లభించడంతో టెన్నిస్ బ్యాట్‌ను చేతపట్టింది. ఆరు సంవత్సరాల వయసులో టెన్నిస్ ప్రాక్టీసును మొదలు పెట్టిన సానియా నిజాం కాలేజీలో కోచ్ శ్రీకాంత్ వద్ద మొదట్లో శిక్షణ తీసుకుంది. తర్వాత టెన్నిస్‌లో విజయాలతో ఒక్కొక్క మెట్టే అధిరోహిస్తూ పోయింది. తర్వాత కాలంలో పి.కె.జైన్ వద్ద కోచింగ్ తీసుకుంది. ప్రస్తుతం ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు మహేష్ భూపతి తండ్రి సి.జి.కె.భూపతి బెంగుళూరులో స్థాపించిన టెన్నిస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నది. ప్రతిరోజూ ఆరు గంటలకు పైగా ప్రాక్టీసు చేసే సానియా వింబుల్డన్, యు.ఎస్. ఓపెన్ టైటిల్స్ సాధించడమే జీవిత లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ ఏడాది మహిళల టెన్నిస్ ర్యాంకింగ్‌లో మొదటి 500 స్థానాలలో నిలవడానికి ప్రయత్నిస్తున్నది.

హైదరాబాద్ టోర్నీ ద్వారా పలువురు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు తమ ప్రతిభను చాటిచెప్పారు. అంతేగాక వర్ధమాన క్రీడాకారిణులు రంగంపైకి రావడానికి ఈ టోర్నీ తోడ్పడింది. రాష్ట్రానికి చెందిన సానియామీర్జా, గీతా మనోహర్, పూజ కొమ్మిరెడ్డిలు అన్‌సీడెడ్‌గా ప్రధాన డ్రాకు ఎంపికయ్యారు. మరో క్రీడాకారిణి పూనంరెడ్డి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా పోటీల్లో పాల్గొంది. ఈ క్రీడాకారిణులు తమ ఆటతీరుతో ఆకట్టుకున్నారు. తమలో ప్రతిభకు లోటులేదని నిరూపించారు. సానియా మీర్జా విజేతగా నిలవగా, గీతామనోహర్ క్వార్టర్‌ఫైనల్ వరకు చేరుకుంది. పూజ కొమ్మిరెడ్డి, పూనంరెడ్డిలు కూడా తొలి, మలి రౌండ్‌లను దాటగలిగారు. విజేతగా నిలిచిన తర్వాత సానియా వినయంగా తనలోని లోటు పాట్లను విశదీకరించి ఇకపై తనలోని లోపాలను సరిదిద్దుకుని సీనియర్ సర్క్యూట్‌లలో మరిన్ని టైటిల్స్ నెగ్గడానికి కృషి చేయనున్నట్లు తెలిపింది. హైదరాబాద్ ఒక అంతర్జాతీయ టెన్నిస్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనున్న దృష్ట్యా అందులో భాగంగా నిర్మించిన ఫతేమైదాన్ టెన్నిస్ కాంప్లెక్స్‌ను ఈ టోర్నీతో ప్రారంభించారు. ఫతేమైదాన్‌లో ఒక సెంటర్ కోర్టు, ఆరు ప్రాక్టీస్ కోర్టులను రూపొందించారు. వీటిని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సింథటిక్ టర్ఫ్‌తో ఏర్పాటు చేశారు. దీనిద్వారా హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ కోర్టుల కొరత తీరింది. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ఈ అంతర్జాతీయ టెన్నిస్ పోటీలను ఇక్కడ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు, పారిశ్రామికవేత్త అయిన జి.వి.కె. రెడ్డి స్వయంగా స్పాన్సర్‌షిప్‌ను అందించి టోర్నీని ఘనంగా నిర్వహించారు. ❖

మొలకలపల్లి కోటేశ్వరరావు

నిద్రలేచి బయట వాకిలి దగ్గర నిలబడి బ్రష్ చేసుకుంటున్న ముత్యాలరావు ముఖం మీద ధన్‌మని బాంబు పడింది.

వాళ్ళు అద్దెకు వుంటున్న ఇంటి యజమాని ఎలమందరావు "వచ్చే నెల నించీ మీరు వుంటున్న పోర్షన్‌కి అద్దె వంద రూపాయలు పెంచుతున్నాను సార్!" అని బాంబు జారవిడిచాడు.

ముత్యాలరావు ముఖం మలమల మాడిపోయింది.

"అదేమిటి సార్.. రెండు నెలల క్రితం మొన్న జనవరిలోనే కదా అద్దె నూటయాభై రూపాయలు పెంచింది. మళ్ళీ ఇంతలోనే పెంచడం ఏం ధర్మమండీ?" వస్తున్న ఏడుపుని దిగమింగుకుంటూ అడిగాడు ముత్యాలరావు.

"ధర్మాధర్మాల ప్రస్తావన వద్దు. రెండు నెలల క్రితం అద్దె పెంచిన మాట వాస్తవమే ! ప్రతి ఏడూ జనవరి నెలలో పెంచే రివాజు ప్రకారమే అప్పుడు పెంచాను. ఇంతలోనే మళ్ళీ ఇప్పుడు పెంచడం నాకూ ఇష్టం లేదు. కానీ తప్పదు. గవర్నమెంట్ కరెంట్ ఛార్జీలు పెంచింది కదా!"

"బట్టతలకీ, మోకాలికీ ముడిపెడితే ఎలా సార్? వాళ్ళు ఎవరో కరెంట్ ఛార్జీలు పెంచారని మీరు మాకు ఇలా వడ్డిస్తే ఎలాగండీ?"

"అక్కడే మీరు పొరపడుతున్నారు. మన మున్సిపాల్టీ వాళ్ళ టాప్ ఒకరోజు వస్తే వారం రోజులు సెలవు తీసుకుంటుంది కదా! ఈ వారం రోజులూ బోరింగ్ నీళ్ళు రావాలంటే మోటార్ ఎంత కరెంట్ లాగుతుంది? అలాగే మున్సిపాల్టీ వాళ్ళు కూడా హౌస్‌టాక్స్ పెంచారు తెల్సా? మున్సిపాల్టీకి వచ్చే ఆదాయం అంతా వీధి లైట్ల కరెంట్ బిల్లులకే సరిపోతుందని చెప్పి వాళ్ళూ అడ్డగోలుగా పన్ను పెంచారు. ఇవి మాకు అదనపు ఖర్చులే కదా! ఇవన్నీ మీరు భరించక ఎవరు భరిస్తారు?" సౌమ్యంగా అయినా స్పష్టంగా చెప్పాడు ఎలమందరావు.

"ఛ.... ఛ... ఏం గవర్నమెంటో, ఏంపాడో! ఏడాదికోసారి కరెంట్ బిల్స్ పెంచి సామాన్యుడ్ని నిలువునా పీల్చి పిప్పి చేస్తోంది!" తిట్టుకుంటూ బ్రష్ చేసుకున్నాడు.

జీతం చాలీచాలక నానా అవస్థలు పడుతున్న అతనికి ఇది గోరు చుట్టు మీద రోకటి పోటే!

"ఇవ్వాళ ఇంట్లో టిఫిన్ చేయలేదండీ! బజారుకి వెళ్ళి తీసుకురండి!" భార్య భానుమతి నసుగుతూ అంది.

"ఎందుకు చేయలేదు ఇంట్లో? ఇప్పుడు బజారుకి ఎక్కడ చచ్చేది? ఆదివారం ప్రశాంతంగా ఉందామనుకుంటే... ఛీఛీ!" ఇంటి యజమాని మీద కోపం భార్య మీద చూపెట్టి విసురుగా బాస్కెట్ తీసుకుని హోటల్‌కి దారితీశాడు ముత్యాలరావు.

ఆదివారం. ఈ రోజు విశ్రాంతిగా వుందామనుకుంటే కుదిరేలా లేదు. నిన్న సాయంత్రం మోటార్ సైకిల్‌కి పంక్చర్ అయింది. ఇవ్వాళ వేయిస్తే కానీ రేపు సకాలంలో ఆఫీసుకు చేరలేడు! నెత్తిమీద జుట్టు పెరిగింది. కటింగ్ చేయించాలి. ఇంట్లోకి ఏవో సరుకులు కావాలట! సూపర్ బజార్‌కి వెళ్ళి తీసుకురావాలి.

ఆలోచిస్తూ అలవాటుగా వెళ్ళే హోటల్‌కి వెళ్ళాడు.

"ఏంసార్ బావున్నారా... ఏమిటి ఈ మధ్య కనపట్టం లేదు?" కౌంటర్‌లో కూర్చున్న హోటల్ యజమాని నవ్వుతూ పలకరించాడు.

"అప్పుడప్పుడు వస్తూనే వున్నా! నాలుగు దోశె, ఎనిమిది ఇడ్లీ పార్సిల్ చేయండి!" యాభై రూపాయల కాగితం కౌంటర్‌లో ఇచ్చాడు.

నలుగురికీ నాలుగు దోశెలు, మనిషికో రెండు ఇడ్లీ. అయినా తిన్నట్లు వుండదు. ఇంటి దగ్గర చేసుకుంటే తృప్తిగా తినొచ్చు. ఏమిటో భానుమతి! అప్పుడప్పుడూ ఇంట్లో టిఫిన్ చేయకుండా ఎగనామం పెడుతుంది! పనుల వత్తిడే, పాపం!

"ఇంకా ఆరు రూపాయలు ఇవ్వండి సార్" హోటల్ యజమాని అడిగాడు.

"అదేమిటి? నాలుగు దోశె... ఎనిమిది లెక్కన 32, ప్లేట్ ఇడ్లీ నాలుగు రూపాయలు. నాలుగు ప్లేట్లు 16 రూపాయలు. మొత్తం 48 కదండీ! మీరే రెండు ఇవ్వాలి కదా!"

హోటల్ యజమాని నవ్వుతూ తన నెత్తిమీద కొంచెం పక్కగా వున్న రేట్స్‌బోర్డు చూడమన్నట్లు సైగ చేసాడు.

దోశె 9 రూపాయలు, ఇడ్లీ ప్లేట్ 5 రూపాయలు ! పెరిగిన ఇతర ఐటెమ్స్‌తో పాటు వీటి ధరలూ పెద్ద పెద్ద అక్షరాల్లో దర్శనమిచ్చాయి.

"రేట్స్ ఇలా పెంచుకుంటూపోతే ఎలా సార్?" ఏడవలేక నవ్వుతూ ఆరు రూపాయలు ఇస్తూ అన్నాడు ముత్యాలరావు.

"మమ్మల్ని ఏం చేయమంటారండీ? కరెంట్ బిల్ నెలకి నాలుగయిదు వేలు వస్తోంది. పిండి రుబ్బడానికి గ్రైండర్లూ, కస్టమర్స్‌కి ఫ్యాన్లూ, లైట్లూ ఇవన్నీ తప్పవు కదండీ?"

"ఛ..." మనసులో విసుక్కుంటూ బాస్కెట్ తీసుకుని ఇంటికి వచ్చాడు.

పిల్లలు ఇద్దరూ లేచి కొట్టుకుంటూ, తిట్టుకుంటూ హోంవర్క్ చేసుకుంటున్నారు.

"రేయ్... మీరు బ్రష్ చేసుకుని టిఫిన్ చేయండి. చల్లారి పోతుంది!" భానుమతి పిల్లలకి చెప్పింది. ముత్యాలరావు కూర్చుని పేపర్ చూడటం మొదలు పెట్టాడు.

"డాడీ డాడీ... ఈ నెల నించీ స్కూల్ ఫీజు

ట్వంటీ రూపీస్ పెంచారు డాడీ!" బ్రష్ చేసుకుని ఎగురుకుంటూ వచ్చిన అశ్విని అదేదో ఆనందకరమైన విషయమైనట్లు ఉత్సాహంగా చెప్పింది.

"ఎకెడమిక్ ఇయర్ చివర్లో సడెన్‌గా ఫీజు పెంచడం ఏమిటీ? వాళ్ళకి వస్తున్న లాభాలు చాలడం లేదటనా?"

"కాదు డాడీ... కరెంట్ బిల్ ఎన్నో వేలు వచ్చిందట! స్కూల్ కాబట్టి ఎక్కువ రేటు అట కరెంట్! ప్రతి రూంకీ ఫ్యాన్ ఉంటుంది కద డాడీ! పెద్ద రూమ్స్‌కి రెండు ఫ్యాన్స్ కూడా వుంటాయి!"

"డబ్బు దోచుకోవడానికి ఏదో వంక! స్టూడెంట్‌కి ట్వంటీ రూపీస్ అంటే ఎన్నో వేలు వస్తాయి? ఎంత కరెంట్ లాగుతుందేమిటి?" విసుక్కున్నాడు.

పిల్లలతో పాటు తనూ టిఫిన్ చేసి, టీ తాగి, మళ్లీ ఎండ పెరుగుతుందనే ఉద్దేశంతో మోటార్ సైకిల్‌కి పంక్చర్ వేయించడానికి దగ్గరలోనే వున్న సైకిల్‌షాప్ వద్దకివెళ్ళాడు.

ఆ సైకిల్ షాపు కుర్రాడు సైకిళ్ళతో పాటు



మోటార్ సైకిళ్ళకి పంక్చర్లు వేయడంతో పాటు చిన్న చిన్న రిపేర్లు కూడా చేస్తుంటాడు.

ఎక్కువ సేపు కూర్చోపెట్టకుండానే చేస్తున్న పని ఆపి, వెంటనే చక్రం విప్పి పంక్చర్ వేశాడు.

"పదిహేను రూపాయలు ఇవ్వండిసార్!" అడిగాడు ఆ కుర్రాడు.

"అదేమిటి బాబూ.. పన్నెండు రూపాయలే కదా!"

"కాదుసార్. రేటు పెంచి కూడా చాలా రోజులవుతోంది. గాలి మిషన్‌కి చాలా కరెంట్ లాగుతుంది సార్. కరెంట్ ఛార్జీలు పెరిగాయి కదా!" అతను మామూలుగానే అన్నాడు.

"ఏం కరెంట్‌రా బాబూ! ప్రతిదీ కరెంట్ మాదిరిగానే పాకిపోతూ పెరిగిపోతోంది!" నవ్వుతూ అంటూ డబ్బు ఇచ్చి మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు.

ఒకేసారి హెయిర్ కటింగ్ చేయించుకుని ఇంటికి వెళ్దామని సెలూన్ వైపు బండిని పోనిచ్చాడు. తను ఎప్పుడూ కటింగ్ చేయించుకునే షాపే అది.

ఎండ మండిపోతోంది. బండిస్టాండ్ వేసి సెలూన్ నల్లటి అద్దాలలోంచి లోపలికి చూశాడు.

వగటి పూట లోపల ట్యూబ్‌లైట్లు దేదీవ్యమానంగా వెలిగిపోతున్నాయి. ఫ్యాన్లు మహాస్పీడుతో తిరుగుతున్నాయి. సెలూన్‌లోని టీవీలో సినిమా ప్రసారమవుతోంది.

లోపల ఉన్న నాలుగు కుర్చీలలో నలుగురు కూర్చుని 'తలపని' చేయించుకుంటున్నారు.

ఆదివారం రష్ అనుకున్న ముత్యాలరావు బయటవున్న బెంచ్‌మీద కూర్చున్నాడు. పక్కనే న్యూస్‌పేపర్ వుంటే అందుకున్నాడు.

"విద్యుత్ ఛార్జీల పెంపు – సామాన్యుడికి పెనుభారం!"

పేపర్ తెరిచిన వెంటనే మొదటగా కనపడింది ఆ వార్తే!

కరెంట్ పెరుగుదల సమస్యలు తనకి ఈ ఒక్కరోజు నాలుగయిదు ఎదురు కావడంతో ఏమిటో తెలుసుకుందామని వార్త మొత్తం చదివాడు.

ప్రపంచ బ్యాంక్ ఆదేశాలకి అనుగుణంగా విద్యుత్ ఛార్జీలు పెంచారనీ, ఇది మధ్య తరగతి మానవుడికి పెనుభారంగా పరిణమిస్తుందని, వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఒక నాయకుడి ప్రకటన అది.

నిజమే అనిపించింది ముత్యాలరావుకి.

"క్రాపా సార్?" ఒక కుర్చీ ఖాళీ కావడంతో అడిగాడు అక్కడ పని చేస్తున్న కుర్రాడు.

అవునంటూ వెళ్ళి మెత్తటి కుర్చీలో తలనప్పగించి కూర్చున్నాడు.

నెత్తిమీద గిర్రున తిరుగుతున్న ఫ్యాన్ చూసి అది తన నెత్తిమీద పడినట్లే భావించాడు ముత్యాలరావు. అందరూ అన్నిటి ధరలూ పెంచగా వీళ్ళు మాత్రం ఎందుకు పెంచరని అప్పటికే నిర్ణయించుకుని, గతంలో ఇచ్చిన దాని కంటే వాళ్ళు చెప్పినంత ఎక్కువ ఇవ్వడానికే మానసికంగా ప్రిపేరయ్యాడు అతను. అంతకంటే తను చేయగలిగిందేముంది అనుకున్నాడు.

ఇంతకుముందు 22 తీసుకునేవాడు! ఇప్పుడు ఎంతో?

కటింగ్ అయిన తరువాత "ఇరవై ఐదు ఇవ్వండి సార్!" అడిగాడు కుర్రాడు.

"మూడు రూపాయలు పెంచారన్నమాట!" ముత్యాలరావు డబ్బు ఇస్తూ అన్నాడు.

"కరెంట్ రేట్లు పెంచారు కద సార్?"

ముత్యాలరావు మరో మాట మాట్లాడకుండా అతను అడిగినంత ఇచ్చి బండి స్టార్ట్ చేసి ఇంటికి వచ్చాడు. సాయంత్రం పిల్లల్ని ఇంటి దగ్గర వదిలి, భానుమతిని వెంట పెట్టుకుని అవసరమైన సరుకుల కోసం దగ్గరలోనే వున్న సూపర్ బజార్‌కి వెళ్ళాడు.

కందిపప్పు, మినపప్పు, సబ్బులు, పేస్టులు, క్రీములు, నూనెలు ఇవన్నీ భానుమతి సూపర్‌బజార్‌లో తిరుగుతూ బాస్కెట్‌లో వేసుకుంటుంటే ముత్యాలరావు గుండెవేగంగా కొట్టుకోవడం మొదలు పెట్టింది.

ఆ పప్పుల మిల్లులకీ, నూనెల మిల్లులకీ, సబ్బులు, క్రీముల తయారీకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కరెంట్‌తో సంబంధం వుంటుంది. వాళ్ళకి పెరిగిన బిల్లులు ఇవ్వడు తన నెత్తిమీద పడుతున్నాయన్నమాట!

"మీ దగ్గర రేట్లు మరీ ఎక్కువగా వుంటున్నాయి సార్! ఇంతకుముందు ఇంత ఎక్కువ ధరలు వుండేవి కాదు!" బిల్ పేచేస్తూ అన్నాడు ముత్యాలరావు.

"ఇంతకుముందు నెలకి పన్నెండు వందల రూపాయలు కరెంట్ బిల్ పే చేసే వాళ్ళం సార్! ఇప్పుడు నెలకి మూడు వేలు బిల్లుకట్టాల్సి వస్తోంది! చూడండి, ఎన్ని వందల, వేల రెట్లు బిల్ పెరిగిందో!"

"అంత ఎక్కువ బిల్లా?" నోరు తెరిచి ఆశ్చర్యపోతూ అన్నాడు ముత్యాలరావు.

"షాప్స్‌కీ, బిజినెస్ సెంటర్స్‌కీ యూనిట్ ఛార్జెస్ చాలా ఎక్కువ సార్! వీటిని సెపరేట్ కేటగిరీగా డివైడ్ చేశారు. మొదట్లో ఇలా ఉండేది కాదు!"

సరుకులు తీసుకుని భార్య భానుమతితో కలిసి ఇంటిదారి పట్టాడు ముత్యాలరావు.

కరెంట్ షాక్ కొడితే అది ఏ ఒక్క అవయవానికో, భాగానికో పరిమితం కాదు. శరీరం అంతా సెకన్లలోనే వ్యాపించి మనిషి ప్రాణం తీసినట్లు, కరెంట్ ఛార్జీల పెరుగుదల మన ఇంటికి చెల్లించే బిల్ వరకే పరిమితం కాకుండా నిత్య జీవితంలో ప్రతి ఒక్క అంశం మీదా ప్రభావం చూపెడుతుందన్నమాట!

ఛార్జీలకి వ్యతిరేకంగా సాగే ఈ ఉద్యమం ఎంతో న్యాయమైనది! తను కూడా ఈ ఉద్యమంలో భాగస్వామి కావడం బాధితుడిగా తన బాధ్యత! అవును, తను తప్పనిసరిగా ఈ ఉద్యమంలో చేరాలి.

ఆ రోజు సాయంత్రమే ముత్యాలరావు పెరిగిన కరెంట్ ఛార్జీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యమకారుల్ని కలుసుకుని తన భాగస్వామ్యాన్ని తెలియజేశాడు. ✤

ఒక ముస్లిం విప్లవకారుని కథ

అనాదిగా చరిత్ర ఎప్పుడూ విజేతల పక్షాన లిఖించబడుతుంది. అలా భారతదేశ స్వాతంత్ర్య చరిత్ర ఇండియన్ కాంగ్రెస్ చరిత్రగా మారిపోయింది. కాంగ్రెస్‌కు పోటీగా - వ్యతిరేకంగా పనిచేసిన పార్టీలు, వీరుల గురించి అప్పటి స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పెద్దగా పట్టించుకోలేదనే చెప్పాలి. గాంధీ నిర్ణయాలను, సిద్ధాంతాలను వ్యతిరేకించిన దేశభక్తులు, విప్లవవీరులంతా తీవ్రవాదులుగా ముద్ర వేయబడ్డారు. అలా అన్యాయానికి, విస్మృతికి గురయిన అమరవీరుల చరిత్రను వెలుగులోకి తెచ్చే ప్రయత్నంలో వెలువడిన చిరుపొత్తమే "షహీద్ - ఏ - ఆజం అష్ఫాఖుల్లా ఖాన్."

హిందూ, ముస్లింల ఐక్యపోరాటంతోనే స్వాతంత్ర్యాన్ని పొందగలం అనే భావనతో పోరాట తొలి దశలో ముస్లింలకు స్వాతంత్ర్యోద్యమంలో ప్రాముఖ్యత నిచ్చారు. తర్వాత దశలో హిందూ అతివాదుల ప్రాబల్యం, జిన్నా వేరే పార్టీ పెట్టడంతో క్రమంగా కాంగ్రెస్‌లో ముస్లింల ప్రాధాన్యత తగ్గిపోయింది. జిన్నా పార్టీ ముస్లింల పార్టీగా ముద్రవేసుకోవడం, అది క్రమంగా దేశ విభజనకు దారితీయడంతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లింలను కూడా విభజనపరులుగా చిత్రీకరించే పరిస్థితి ఏర్పడింది.

ఇలాంటి పరిస్థితుల్లో భారత జాతీయోద్యమంలో పాల్గొన్న ముస్లింల చరిత్ర గురించి, మరుగున పడిన ముస్లిం దేశభక్తుల గురించి ప్రామాణికమైన పరిశోధన గ్రంథాలు వెలువరిస్తున్న సయ్యద్ నశీర్ అహ్మద్ కృషి ప్రశంసనీయం. దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబం ఎక్కిన మొట్టమొదటి ముస్లిం మతస్తునిగా అష్ఫాఖుల్లా ఖాన్‌కు చరిత్రలో ఒక ప్రముఖ స్థానం ఉంది. విద్యాధిక, సంపన్న జమీందారీ కుటుంబంలో పుట్టిన అష్ఫాఖుల్లా ఖాన్ ఆ జమీందారీ సంస్కృతికి దూరంగా దేశభక్తి భావాలతో, ఉద్యమకారుడిగా ఎదగడమే ఒక విచిత్రం. ముస్లింల పట్ల చూసే అనుమాన దృక్కుల నుండి బయటపడి తన దీక్ష, నిజాయితీలతో బిస్మిల్లా అభిమానాన్ని చూరగొని 'హిందూస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్'లో చేరుతాడు. విప్లవ దళ సభ్యుడిగా క్లిష్టతరమైన బాధ్యతలను నిర్వహించిన అష్ఫాఖుల్లా ఖాన్ వ్యక్తిగతంగా విభేదించినా ఉమ్మడి నిర్ణయాలను గౌరవించి క్రమశిక్షణగల సైనికుడిగా మెదిలాడు. ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ నికార్సయిన విప్లవకారుడిగా ఎదిగిన అష్ఫాఖ్ మంచి ఉర్దూ కవిగా కూడా పేరు పొందాడు.

విప్లవోద్యమానికి నిధుల కొరత ఏర్పడటంతో ఆర్థిక వనరుల కోసం ప్రభుత్వ ఖజానాను తరలిస్తున్న రైలును దోపిడీ చేయడానికి పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీని పటిష్టం చేసుకోక ముందే ప్రభుత్వానికి సవాల్‌లాగా తయారుకావడం ఆత్మహత్యా సదృశమని అష్ఫాఖ్ ఎంత వాదించినా పార్టీ పట్టించుకోదు. 'కాకోరీ రైలు దోపిడి'తో విరుచుకుపడ్డ బ్రిటిష్ ప్రభుత్వం ఒక్కొక్కరిని వెంటాడి పట్టుకుంటుంది. మిత్రద్రోహం వల్ల పట్టుబడ్డ అష్ఫాఖ్ ప్రభుత్వ ప్రలోభాలకు లొంగకుండా, క్షమాభిక్షను అర్థించకుండా ధైర్యంగా నవ్వుతూ ఉరికంబాన్ని అధిష్టించి అమరవీరుడయ్యాడు.

భగత్‌సింగ్ కంటే నాలుగు సంవత్సరాల ముందు విప్లవోద్యమంలో ప్రాణాలర్పించిన అష్ఫాఖుల్లా ఖాన్ ఆర్థిక అసమానతలు, సాంఘిక అంతరాలు, ఏ రకమైన దోపిడీలేని సమసమాజ వ్యవస్థను ఆశించాడు. ఒకవేళ సమసమాజం సాధ్యంగాని స్వతంత్ర భారతం లభించనున్నట్టయితే అటువంటి స్వరాజ్యం అక్కరలేదని ఆయన స్పష్టంగా ప్రకటించాడు. జమీందారీ కుటుంబం నుంచి వచ్చిన అష్ఫాఖుల్లా జమీందారీ వ్యవస్థ పట్ల వ్యతిరేకతను తెలియజేయడం గమనార్హం. సమసమాజానికి అధిక ప్రాముఖ్యత నిచ్చిన అష్ఫాఖుల్లా ఖాన్ హిందూ - ముస్లింల ఐక్యతకు కూడా అంతటి స్థానం కల్పించాడు. మౌలానా అబుల్ కలాం స్థాయిలో హిందూ - ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన అష్ఫాఖుల్లా ఖాన్‌లాంటి దేశభక్తులు ఎప్పుడూ చిరస్మరణీయులే.

- కె.పి. అశోక్‌కుమార్

రచన: సయ్యద్ నశీర్ అహ్మద్,
ప్రచురణ: ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్,
ఉండవల్లి సెంటర్, గుంటూరు జిల్లా,
వెల: 10 రూపాయలు, పేజీలు: 32,
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

స్వీకారం

సామాజిక పరిస్థితులను సందర్భోచితంగా చిత్రించి సామాన్యులను సైతం ఆలోచింప చేయగల శక్తి కార్టూనిస్ట్ గీతల కుంటుంది కార్టూనిస్ట్ అయిన ఈ పుస్తక రచయిత కొన్ని కార్టూన్స్‌ను, జోక్స్‌ను కలిపి చిన్న పుస్తకంగా ముద్రించారు.

అల్లరి జోక్స్ - చక్కలిగింతలు (కార్టూన్లు)

రచన : చలపాక ప్రకాష్; వెల : రూ. 4/-;
ప్రతులకు : సి. హెచ్. కృష్ణప్రియ, 1-4/3-36, విద్యాధరపురం, విజయవాడ - 12



ఈ పుస్తక రచయిత సేకరించిన సామెతల సంకలనమే ఇది. ఇందులోని సామెతలు కర్నూలు జిల్లా ప్రాంతంలో వ్యవహారంలో వున్న భాషతో ఆచార సంప్రదాయాలకు అద్దం పట్టే నీతులకు సూక్తులుగా ఉన్నాయి. పలువురి జ్ఞానం, ఒక్కరి వివేకంగా కనిపిస్తూ మానవుని నోటిలో అప్రయత్నంగా పుట్టి అంతరించే సామెతలకు జీవం పోయడమే రచయిత ఉద్దేశం కావచ్చు.

సామెతల సౌరభాలు

సేకరణ: సవ్వప్ప గారి ఈరన్న; **వెల :** రు. 10/-;
ప్రతులకు: నవయుగ బుక్‌హౌస్, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

సాహిత్య సంఘాలు - ధోరణులు చారిత్రిక విశ్లేషణలు, పత్రాలు

సంపాదకుడు : తెలకపల్లి రవి; **వెల :** రు. 70/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఒక కన్నీటి చుక్క కోసం

రచన : అరుణ్ బవేరా; **వెల :** రు. 40/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, దిశ పుస్తకకేంద్రం, హైదరాబాద్

గ్లోబలైజేషన్ - సాహిత్య దృక్పథం

రచన : గుడిపాటి; **వెల :** రు. 20/-
ప్రతులకు : శకుంతల, 16-11-31/12/ఏ/3, సలీమ్‌నగర్ కాలనీ, మలక్‌పేట్, హైదరాబాద్. డా॥ పులిపాటి గురుస్వామి, ఇ.నెం. 6-47, బాంక్‌కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్